క్లుప్తంగా

ఆస్తి పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

హాలియా: ఆస్తి పన్నుపై ప్రభుత్వ ఇస్తున్న ఐదు శాతం రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హాలియా మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హాలియా మున్సిపాలిటీలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లించి ఐదు శాతం రాయితీ పొందాలన్నారు. గతంలో బకాయి ఉన్న వారికి ఇది వర్తించదని, బకాయితో పాటు ఈ ఏడాది పన్ను కూడా చెల్లించిన వారు రాయితీ పొందవచ్చని తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



గేదె కళేబరాన్ని పరిశీలిస్తున్న మండల పశువైద్యాధికారి శశికళ

త్రిపురారం: మండల కేంద్రంలో బుధవారం విద్యుదాఘాతంతో గేదె మృతిచెందింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండల కేంద్రానికి చెందిన సింగం కనకమ్మ తన పాడి గేదెను మేత కోసం పొలాల్లోకి తోలుకెళ్లింది. గేదె మేత మేసుకుంటూ పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగకు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న త్రిపురారం మండల పశువైద్యాధికారి డాక్టర్ శశికళ ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా చేశారు. మృతిచెందిన గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని బాధితురాలు కోరుతోంది.

శానంపూడి సైదిరెడ్డి గెలుపునకు కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

దేవరకొండ: నరేంద్ర మోదీని మూడోసారి ప్రధాన మంత్రిని చేయడమే లక్ష్యంగా బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి గెలుపునకు కృషిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్, గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లేష్‌నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం దేవరకొండ పట్టణంలో జరిగిన బీజేపీ గిరిజన మోర్చా నియోజకవర్గ స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి తండాలో కార్నర్ మీటింగ్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలను తెలియజేయాలని అన్నారు. సమావేశంలో వడ్త్య భిక్షపతి, గుండాల అంజయ్య, వినోద్ రాథోడ్, సంతోష్‌నాయక్, కొర్ర రాజు, అంజినాయక్, శంకర్‌నాయక్ తదితరులున్నారు.

శాశ్వత చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



మిర్యాలగూడ బస్టాండ్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీసీ డీఎం పాల్ తదితరులు

మిర్యాలగూడ టౌన్: వాసవీ క్లబ్ గ్రేటర్ మిర్యాలగూడ అధ్యక్షుడు రేపాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో శాశ్వత చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆర్టీసీ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ అన్నారు. బుధవారం ఆర్టీసీ బస్టాండ్‌లో వాసవీ క్లబ్ గ్రేటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని క్లబ్ గవర్నర్ రాచర్ల కమలాకర్, కోశాధికారి కలకోట లక్ష్మయ్య, ఐఈసీ ఆఫీసర్ తెడ్ల జవహర్‌తో కలిసి డిపో మేనేజర్ ప్రారంభించారు. అనంతరం ప్రయాణికులు, పాదాచారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు బండారు వెంకటేశ్వర్లు, మిర్యాల శత్రయ్య, జనార్దన్, గుండా మల్లయ్య, నీలా ఆనంద్, ఉప్పల విద్యాసాగర్, లకుమారపు పాండురంగయ్య, శ్రీనివాస్, ఓరుగంటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు సమన్యాయం

కొండమల్లేపల్లి: కాంగ్రెస్ పార్టీతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సమన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు యేకుల సురేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నిరంగాల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించనున్నట్లు తుక్కుగూడ సభలో రాహుల్ గాంధీ స్పష్టం చేశారని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

నీళ్లు లేక కన్నీళ్లు మిగిలే..



పెద్దవూర: జయరాంతండా సమీపంలో ఎండిపోయిన బత్తాయి తోట



డిండి: గోనకొల్ గ్రామంలో ఎండిపోయిన వరి చేను

- ఎండిపోతున్న పంటలు, తోటలు
- ఆందోళనలో రైతులు

పెద్దవూర: మండలంలో యాసంగిలో సాగు చేసిన పంటలు తీవ్ర వర్షాభావంతో ఎండిపోతున్నాయి. నాన్ ఆయకట్టు ప్రాంతమైన పెద్దవూర మండలంలో బోర్లు, బావులు, చెరువుల కింద రబీలో వరి పంటలు సాగు చేశారు. మండలంలోని జయరాంతండా, పాల్తీతండా, పర్వేదుల, సుద్దబావితండా, నాయినివానికుంటతండా, పోలేపల్లి, ఏనేమీదిగూడెం, పోతునూరు తదితర గ్రామాలలో సాగు చేసిన వరి పంటలు కళ్లముందే ఎండిపోతున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో రైతులు ఉన్నారు. పక్కనే నాగార్జునసాగర్ జలాశయం, ఏఎమ్మార్పీ ప్రాజెక్టులు ఉన్నా వందలాది ఎకరాల్లో పంట పొలాలు ఎండిపోతున్నాయి. ఆరుగాలం శ్రమించి వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి సాగు చేసి పండించిన పంట చేతికి వచ్చే వరకు రైతుకు భరోసా లేకుండా పోతుంది. ఒకవైపు గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతుంటే, మరోవైపు వర్షాలు పడక పంటలు ఎండిపోతుంటే రైతు కన్నీటి ఘోష ఎవరికీ పట్టడం లేదు. గత ఏడెనిమిది నెలలుగా వర్షాలు పడకపోవడం, ఎండలు తీవ్రంగా ఉండటంతో చెరువులు, కుంటలు ఎండిపోయాయి. దీంతో రైతులు పంటలు, తోటలను కాపాడుకోవటానికి పడరాని పాట్లు పడుతున్నా ఫలితం లేకుండా పోయింది.



పెద్దవూర: ఎండిపోయిన చింతపల్లి చెరువు



పెద్దవూర: నాయినివానికుంటతండాలో ఎండిపోయిన బావి

పశువులకు మేతగా 15 ఎకరాల్లోని వరి

డిండి: డిండి ఆయకట్టుకు యాసంగి సీజన్‌లో సాగు నీటిని విడుదల చేయకపోయినా.. ప్రాజెక్టు మెయిన్ కెనాల్ ద్వారా వచ్చే లీకేజీ వాటర్‌పై ఆధారపడి మండల పరిధిలోని గోనకొల్ గ్రామ శివారులో పలువురు రైతులు దాదాపు 15ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. కానీ పంట చివరి దశకు చేరుకున్న సమయంలో కెనాల్ నుంచి లీకేజీ పూర్తిగా బంద్ కావడంతో వరి పంట ఎండిపోతోంది. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట చేతికొస్తుందన్న సమయంలో తమ కళ్ల ముందే పశువులకు మేతగా మారిందని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ: కాంగ్రెస్ పార్టీతోనే దేశంలో, రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యపడుతుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం దేవరకొండ మండలం జర్పులతండాకు చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ఆయన తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దేవేందర్‌నాయక్, బిక్కునాయక్, లోచన్‌సింగ్, నారాయణనాయక్ తదితరులున్నారు.

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని వినతి

నల్లగొండ: పాఠశాలకు గైర్హాజరవుతూ రిజిస్టర్‌లో మాత్రం హాజరవుతున్నట్లుగా సంతకాలు పెడుతున్న అడవిదేవులపల్లి మండలం జిలకరకుంటతండా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కాశయ్యపై చర్యలు తీసుకోవాలని మిర్యాలగూడకు చెందిన డి.రాజు బుధవారం నల్లగొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ హరిచందనకు వినతి పత్రం అందజేశారు. హెచ్‌ఎం కాశయ్య కొన్ని నెలలుగా పాఠశాలకు సక్రమంగా హాజరుకావడం లేదని, ఇద్దరు ఉపాధ్యాయులుంటే వంతుల వారీగా విధులు నిర్వహిస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ విషయం స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంకు తెలిసినా పట్టించుకోవడం లేదని, దీనిపై విచారణ జరిపించాలని కోరారు. దీనిపై అడవిదేవులపల్లి ఎంఈఓను వివరణ కోరగా.. డీఈఓ ఆదేశాల మేరకు తాను స్కూల్‌కు వెళ్లి విచారణ చేయగా, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం అనుమతితో హెచ్‌ఎం కాశయ్య బుధవారం సెలవు పెట్టుకున్నాడని పేర్కొన్నారు. ఏప్రిల్ నెల వరకు హెచ్‌ఎం కాశయ్య ఏడు సెలవులు వాడుకున్నట్లు ఎంఈఓ వివరణ ఇచ్చారు.

టెట్ దరఖాస్తు ఫీజు తగ్గించాలి

మిర్యాలగూడ టౌన్: గతంలో కంటే ఈసారి ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు తక్కువ మంది దరఖాస్తు చేసుకున్నందున.. ప్రభుత్వ దరఖాస్తు ఫీజును తగ్గించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో టెట్ దరఖాస్తు ఫీజు రూ.200 ఉంటే ఈసారి రూ.1000కి పెంచడం విడ్డూరంగా ఉందన్నారు. టెట్ దరఖాస్తు గడువును మరో 10రోజులు పొడిగించిన నేపథ్యంలో ఫీజును తగ్గించి ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బాలాజీనాయక్

అడవిదేవులపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్ అన్నారు. బుధవారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. వేసవిలో సంబంధిత అధికారులు నీటి ఎద్దడి, విద్యుత్ అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. అదే విధంగా ప్రజలు ప్రజలు ఎండలో బయటకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతేనే బయటకు వెళ్లేటప్పుడు గొడుగు తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ పి. కరుణాకర్‌రావు, వైస్ ఎంపీపీ కూరాకుల మల్లేశ్వరీ, ఎంపీటీసీలు పేర్ల లింగయ్య, బాలునాయక్, క్రాంతికృష్ణ, డాక్టర్ ఉపేందర్, విద్యుత్ ఏఈ శ్రీనునాయక్, వ్యవసాయ అధికారి అర్చన తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి

హాలియా: పౌష్టికాహారంతోనే చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి అన్నారు. ఐసీడీఎస్ అనుముల ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం అనుముల మండల పరిధిలోని అలీనగర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిరుధాన్యాల్లో అధిక పోషక విలువలు ఉంటాయని అవి ఆరోగ్యానికి ఎంతో మంచివని అన్నారు. తక్కువ బరువుతో పుట్టే పిల్లలు, బలహీనంగా ఉండే గర్భిణులు చిరుధాన్యాలు, ఆకుకూరలు తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ ఫర్జానా, స్కూల్ టీచర్ రజియా బేగం, మహేశ్వరీ, హెల్పర్ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి నివాళి



సైదులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

త్రిపురారం: మండలంలోని చెన్నాయిపాలెం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయుడి(స్కూల్ అసిస్టెంట్)గా పనిచేస్తున్న మిర్యాలగూడ మండలం తుంగపహాడ్ గ్రామానికి చెందిన సామ సైదులు సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. బుధవారం చెన్నాయిపాలెం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు సామ సైదులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు సైదులును తలచుకొని విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడి సైదిరెడ్డి, ఉపాధ్యాయులు గోపి, సైదయ్య, అంజమ్మ, మంక్లా, నర్సింహస్వామి, మాలోతు దశరథనాయక్, శ్రీదేవి, దుర్గా మల్లేశ్వరి, తిరుపతమ్మ, రాము, విజయలక్ష్మి, విద్యార్థులు ఉన్నారు.

కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు

- కుక్కడం గ్రామ శివారులో ఘటన



క్షతగాత్రులను కారు నుంచి బయటకు తీస్తున్న స్థానికులు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రవీందర్

మాడుగులపల్లి: కారు అదుపుతప్పి పల్టీ కొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. మాడుగులపల్లి మండలం కుక్కడం గ్రామ శివారులో బుధవారం ఈ ఘటన జరిగింది. స్థానికులు, ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండల కేంద్రానికి చెందిన మేడి ఇద్దయ్య తన మనమరాలు, మరో వ్యక్తితో కలిసి మిర్యాలగూడ పట్టణంలోని తన కుమార్తె ఇంటికి బయల్దేరాడు. కుక్కడం శివారుకు రాగానే కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను కారు నుంచి అతికష్టం మీద బయటకు తీసి చికిత్స నిమిత్తం మిర్యాలగూడ తరలించారు. అటుగా వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు దైద రవీందర్ తన కారును నిలిపి అనుచరులతో కలిసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు



పెద్దవూర: ముస్లింలకు ఖర్జూర తినిపిస్తున్న మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి



డిండి: ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



నాగార్జునసాగర్: రంజాన్ తోఫా అందజేస్తున్న యూనిట్ ఆఫ్ ఉమ్మహ్ సంస్థ సభ్యులు

పెద్దవూర: పవిత్ర రంజాన్ మాసంలో ఇచ్చే ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి అన్నారు. బుధవారం పెద్దవూర మండల కేంద్రంలోని మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు ఖర్జూరా తినిపించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు, నడ్డి ఆంజనేయులు, కోట అంజి, లక్ష్మయ్య, ఎండీ హాజీ, హైమద్‌అలీ, జానివియా, షబ్బీర్, రంజాన్, ఇబ్రహీం, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

డిండి: రంజాన్ పండుగను పురస్కరించుకొని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వడ్త్య రమేష్‌నాయక్ సహకారంతో బుధవారం డిండి మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు 21 మంది నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డిండి పట్టణ అధ్యక్షుడు గిరమోని శ్రీను, బల్మూల తిరుపతయ్య, ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు రషీద్, మోహినొద్దీన్, గుర్రం సురేష్, పున్న లింగమయ్య, వినోద్, పీర్ మహ్మద్, వెంకటేష్, నిరంజన్, బాసు, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్‌లో..

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీలో గల మసీదు సమీపంలో యూనిటీ ఆఫ్ ఉమ్మహ్ సంస్థ ఆధ్వర్యంలో 15మంది పేద ముస్లిం కుటుంబాలకు బుధవారం రంజాన్ తోఫా అందజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు హాజీఫ్ అబ్దుల్ వహీద్, సుబానీ, షబ్బీర్, మజ్జు, నజీర్, ఖాజా, షరీఫ్, జమీర్, ఆదిల్, సయ్యద్, నజీరొద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మసీదు కమిటీ ఆధ్వర్యంలో నందికొండ మున్సిపాలిటీలో పనిచేస్తున్న సిబ్బందికి పండ్లు పంపిణీ చేశారు.

రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవాలి

వేములపల్లి: రంజాన్‌ను ముస్లింలు ఘనంగా జరుపుకోవాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం వేములపల్లి మండల కేంద్రంలోని ఉస్మానియా మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో పాల్గొని ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, నాయకులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో ముస్లింలకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

ఈద్గాల వద్ద ఏర్పాట్లు పూర్తి

మిర్యాలగూడ టౌన్: రంజాన్ సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డ ఈద్గా పరిసరాలను శానిటేషన్ ఎస్‌ఐ వెంకటరమణ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది బుధవారం శుభ్రం చేశారు. ఈద్గాలో మట్టిని చదును చేసి గోడలకు సున్నం వేయడంతో పాటు తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. అదేవిధంగా మిర్యాలగూడ మండలంలోని టీక్యాతండా వద్ద గల ఈద్గా పరిసరాలను కూడా ఈద్గా నిర్వాహకులు శుభ్రం చేయించారు.



బంగారుగడ్డ ఈద్గా పరిసరాలను శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

షబ్బీర్ అలీకి శుభాకాంక్షలు



షబ్బీర్ అలీకి పుష్పగుచ్ఛం అందజేసి రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న పోషం సునీత

మిర్యాలగూడ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీని బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో చేనేత ఐక్య వేదిక అధికార ప్రతినిధి, మిర్యాలగూడలోని శ్రీబాలాజీ హాస్పిటల్ అధినేత్రి పోషం సునీత శ్రీనివాస్ కలిసి రంజాన్ శుభాకంక్షలు తెలిపారు. ఆమె వెంట చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరమోహన్, బాలాజీ హాస్పిటల్ మేనేజింగ్ పార్ట్‌నర్ గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో నగదు అపహరణ

మిర్యాలగూడ అర్బన్: గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడి నగదును అపహరించారు. మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. హౌజింగ్‌బోర్డు కాలనీలో నివాసం ఉంటున్న మోర చంద్రశేఖర్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఉగాదికి తిప్పర్తి మండలం పజ్జూరు గ్రామానికి వెళ్లాడు. గమనించిన దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి సెల్ఫ్‌లోని బట్టల కింద దాచిన రూ.50 వేలను చోరీ చేశారు. బుధవారం ఊరి నుంచి ఇంటికి తిరిగి వచ్చేసరికి తాళం పగుల కొట్టి ఉందని, ఇంట్లోని వస్తువులను చిందరవందరగా పడేయడంతో పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీం రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మాల్ సంత నిర్వహణకు వేలం

యాచారం: మాల్ పశువుల సంత నిర్వాహణకు బుధవారం మాల్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వేలం నిర్వహించారు. పశువుల సంత నిర్వాహణకు ఇద్దరు పోటీ పడగా వేలంలో నల్గొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన ముత్యాల ఆంజనేయులు రూ.75,53,000 లకు దక్కించుకున్నాడు. తైబజార్ నిర్వాహణకు ఇద్దరు పోటీ పడగా మాల్ గ్రామానికి చెందిన గుడుకుంట్ల కృష్ణ రూ.1,16,700లకు దక్కించుకున్నాడు పశువుల సంత, తైబజార్‌ను దక్కించుకున్న వారు 2025 మార్చి 30 వరకు నిర్వాహణ అనుమతులుంటాయని మాల్ పంచాయతీ కార్యదర్శి రాజు తెలిపారు.

ఎన్నికల విధుల పట్ల అవగాహన ఉండాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రైనర్స్

దేవరకొండ: లోక్‌సభ ఎన్నికల విధుల పట్ల ఎన్నికల సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని దేవరకొండ తహసీల్దార్ సంతోష్‌కిరణ్ అన్నారు. ఇటీవల దేవరకొండ పట్టణంలోని ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఎన్నికల శిక్షణ కార్యక్రమానికి హాజరుకాని సిబ్బందికి బుధవారం జిల్లా రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు మరోసారి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం పోలింగ్ కేంద్రాల్లో పీఓ, ఏపీఓ, ఓపీఓలు నిర్వహించే విధులపై మాస్టర్ ట్రైనర్లు ఎన్నికల సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వెంకటేష్, శేఖర్, రేణికుంట్ల రాజశేఖర్, ఇద్దయ్య, గోవర్ధన్ తదితరులున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చింతపల్లి: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండల పరిధిలోని నందిగడ్డ వాగు నుంచి ట్రాక్టర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారంతో గ్రామ సమీపంలో పోలీసులు నిఘా పెట్టి ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



ఎండ ఎఫెక్ట్

భానుడి భగభగకు జనం విలవిల్లాడుతున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటికి వెళ్లేందుకు జంకుతున్నారు. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే కొండమల్లేపల్లి చౌరస్తా బుధవారం వేసవి తాపానికి నిర్మానుష్యంగా మారింది. – కొండమల్లేపల్లి



కోడ్ ఎఫెక్ట్

ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో మిర్యాలగూడ పట్టణంలోని ఎన్‌ఎస్‌పీ క్యాంపులో గల మినీ రవీంద్రభారతి(కేసీఆర్ కళాభారతి)పై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 'కేసీఆర్' అనే అక్షరాలను మున్సిపల్ సిబ్బంది తెల్లటి వస్త్రంతో కప్పి ఉంచారు. – మిర్యాలగూడ టౌన్